క్లుప్తంగా

కొనసాగుతున్న దీక్షలు


దీక్షలో పాల్గొన్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని రెవెన్యూ డివిజన్ సాధన జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం చిల్వెర ఐబీ చౌరస్తాలో నిరాహార దీక్షలు నిర్వహించారు. దీక్షలో బ్రహ్మం, రాములు, బేతయ్య తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ డివిజన్‌తో పాటు అల్లాదుర్గం ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్పత్రిగా మార్చాలని, గురుకుల పాఠశాల, సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి బోనాలు తీసి ఒడిబియ్యం సమర్పించి, భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ మానిక్యరెడ్డి, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మూలమంత్ర హోమం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని మహంకాళీ అమ్మవారికి ఆదివారం మూల మంత్ర హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో అభిషేకం, అధివాసాంగ హోమం, ప్రతిష్ట విగ్రహాల ధాన్యాదివాసం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వార్డుమెంబర్లు వెంకటేశ్, సంతోష్, కుమార్, నిర్వాహకులు పవన్, సత్యం, స్వామి, రవి, రఘుపంతులు, భక్తులు పాల్గొన్నారు.

సికింద్లాపూర్ శ్రావణ సందడి


శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కొండ పైనున్న లక్ష్మీనర్సింహస్వామిని కాలినడకన వెళ్లి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈఓ శశిధర్, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ తెలిపారు.

కూచారంలో స్వచ్ఛ భారత్


శుభ్రం చేస్తున్న యువత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంలో నేచర్ ఐకాన్ యువత ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. 282వ వారంలో భాగంగా హరితవనం వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

సన్మానం


రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఐ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేటకు చెందిన అప్పలశెట్టి రాజేశ్వర్ తహసీల్దార్‌గా పదోన్నతి పొందడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయనను ఎస్‌ఐ నారాయణ చేతులమీదుగా శాలువాతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ శ్రీలత, ట్రాన్స్‌కో ఏఈ సరేష్, రామానుజపురం ప్రకాష్, ప్రగతి యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గైక్వాడ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పందులతో పరేషాన్

- పత్తికాయలను తింటున్న అడవిపందులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు


అడవి పందులు తినిపడేసిన పత్తికాయలు


గిడసబారుతున్న పత్తి

టేక్మాల్(మెదక్): పత్తి రైతుకు అడవి పందులు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. రాత్రింబవళ్లు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా.. ఒక్కసారిగా దాడి చేస్తున్న పందులు పంటలను నాశనం చేస్తున్నాయి. ఏటా వందల ఎకరాల్లో పంటలు ధ్వంసం చేస్తుండడంతో రైతన్నలు నష్టాలపాలవుతున్నారు. వీటి నివారణకు అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.

టేక్మాల్ మండలంలోని అన్ని గ్రామాల్లో వరి తర్వాత పత్తి, కంది, జొన్న, మొక్కజొన్న, వరి పంటలు పెద్ద మొత్తంలో సాగయ్యాయి. లక్షలు ఖర్చు చేసి విత్తనాలు కొని, సాగు చేస్తే వర్షాల సమయానికి పడక ఓ వైపు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న పంటలను చూసి సంతోషపడుతుంటే.. అటవీ పందులు దాడి చేసి కాయను నాశనం చేస్తుండడం రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చేలల్లో నీరు నిలిచి ఎర్రబారాయి. కలుపులు తీసి, అధికారులు సూచించిన మందులను పిచికారీ చేస్తూ, పొలాల చుట్టూ చీరలు, వైర్లు కట్టి, చిన్న యంత్రాలను పెట్టి శబ్దం వచ్చేలా చేస్తూ పంటలను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. అడవిపందుల దాడిలో పత్తి మొక్కలు, కాయలు పావడవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పందులను నివారించకపోతే దిగుబడి తగ్గి తాము నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నివారణ చర్యలేవీ?

ప్రభుత్వం అడవి పందులను నివారించాలని ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో అధికారులు అమలు చేయడంలేదు. ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలేదని రైతులు వాపోతున్నారు. వన్యప్రాణుల బెడద నివారణ యంత్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కనులపండువగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కోనాయపల్లి(పీటీ)లో హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహ పున ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో హనుమాన్ విగ్రహాన్ని ఊరేగించగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. వేద పండితుల ఆధ్వర్యంలో జలాదివాసం, పుష్పాదివాసం, ధాన్యాదివాసం, శయనాదివాసం, హోమం నిర్వహించారు. భాషబోయిన చంద్రశేఖర్ దంపతులు, సర్పంచ్ ప్రభావతి, ఉప సర్పంచ్ ధర్మేందర్, గ్రామస్తుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

మారుమోగిన ఏకనామస్మరణ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గూడూర్ శ్రీగురుపీఠం బాలాలయం ఆదివారం ఏకనామ స్మరణతో మారుమోగింది. హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో అదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాయిబాబా ఏకనామస్మరణ నిర్వహించారు. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు సాయి పాదుకలను దర్శించుకున్నారు. కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి బాలాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమాజంలో ప్రతి ఒక్కరు భక్తిభావాలు అలవర్చుకోవాలని, శివకుమార్‌గౌడ్ చేస్తున్న కృషిని కొనియాడారు. బీఆర్‌ఎస్ నాయకుడు పబ్బ రమేష్‌గుప్తా, సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి, మండల కో ఆప్షన్ లాయక్, బిక్షపతియాదవ్, నర్సయ్య, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, రాజేందర్, అంజి, బీజేపీ నాయకులు సింగాయిపల్లి గోపి, వాల్దాస్ మల్లేష్, రవిగౌడ్, ట్రస్ట్ సభ్యులు మోహన్ రావు, సూర్యకుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


గురుపీఠంలో పూజలు చేస్తున్న సునీతారెడ్డి

రంగాయపల్లిలో బోనాలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రంగాయపల్లిలో శ్రావణమాసం సందర్భంగా గ్రామ దేవతలకు బోనాలు నిర్వహించారు. రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితో ఉప సర్పంచ్ నవీన్‌చారి, బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్ న్నారు.

చాముండేశ్వరీకి పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు సమర్పించుకున్నారు. భక్తులు ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకోగా, అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు అందించినట్లు ఆలయ పూజారి తెలిపారు.


సర్వీస్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆర్టీసీ సేవలు ప్రారంభం

రేగోడ్(మెదక్): నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి రేగోడ్, వట్‌పల్లి మీదుగా సదాశివపేట వరకు బస్సు సర్వీసుని అధికారులు ఆదివారం ప్రారంభించారు. రేగోడ్‌కు చేరుకున్న బస్సు సర్వీసుకు పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాధాకిషన్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సుభాష్ పూజలు చేసి, వట్‌పల్లి వరకు టికెట్ తీసుకుని ప్రయాణించారు. సర్వీసును ప్రారంభించడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోట సంగమేశ్వర్, హన్మంతు, గొల్ల కృష్ణమూర్తి యాదవ్, మునీర్, ఇస్మాయిల్, డాక్టర్ భస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన ఉధృతం చేస్తాం

రేగోడ్(మెదక్): మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని నాయకులు మున్నూరు శ్రీనివాస్, శ్రీమాన్ కులకర్ణిలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మండల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వారం రోజుల్లో విలీనం చేయాలని కోరారు. పార్టీలకతీతంగా నాయకులు, ప్రజా ప్రతినిధులు ఈ పోరాటంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం చాకలి ఐలమ్మ చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శివాజీరావు, యువకులు చక్రపాణి, ఆదర్శ, హరి, వినయ్, జగదీష్, వంశీ, సతీశ్ కుమార్, మహేశ్, సుమన్, అమర్‌గౌడ్, నాని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్

మూన్నాళ్ల ముచ్చట


యూసుఫ్‌పేట శివారులో లేచిపోయిన తారు రోడ్డు

పాపన్నపేట(మెదక్): మండలంలో ఇటీవల వేసిన తారు రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. లక్ష్మీనగర్ నుంచి నార్సింగి వరకు మూడు నెలల కిందట తారు రోడ్డు వేశారు. యూసుఫ్‌పేట శివారులో అక్కడక్కడ గుంతలు పడి లేచి పోతోంది. రోడ్డు నిర్మాణంలో నాణ్యత కొరవడిందని, అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఆదివారం జిల్లాలోని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించారు. నాయకులు, ప్రజలు ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆమె పోరాట పటిమను కొనియాడారు. యువత ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.


రామాయంపేట(మెదక్): కోనాపూర్‌లో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీపీ, గ్రామస్తులు

సాక్షి నెట్‌వర్క్: రామాయంపేట మండలం కోనాపూర్‌లో ఎంపీపీ బిక్షపతి, కోనాపూర్ సర్పంచ్ చంద్రకళ, రజక సంఘం మండలాధ్యక్షుడు సిద్దరాంలు ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. కౌడిపల్లి మండలం వెల్మకన్నలో సర్పంచ్ కాజిపేట రాజేందర్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్త, రజక సంఘం ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అల్లాదుర్గం మండలంలో రజక సంఘం ఆధ్వర్యంలో, నిజాంపేట మండలంలో ఎంపీటీసీ నంద్యాల బాల్ రెడ్డి, ఉప సర్పంచ్ తుమ్మల రమేష్ ఆధ్వర్యంలో, హవేళీఘనపూర్ సర్దనలో వైస్ ఎంపీపీ రాధాకిషన్‌యాదవ్ ఆధ్వర్యంలో, పాపన్నపేట మండలంలో కోఆప్షన్ సభ్యులు గౌస్, రజక సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. చేగుంట మండలంలో రజక సంఘం ఆధ్వర్యంలో, వెల్దుర్తి మండలం మాసాయిపేట, తూప్రాన్, టేక్మాల్ మండలంలో రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. మెదక్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పట్టణ అధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్ జయరాజు, కో ఆప్షన్ సభ్యులు ఉమర్, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుబేర్, పట్టణ సోషల్ మీడియా అధ్యక్షుడు కిరణ్, నాయకులు పాల్గొన్నారు.


కౌడిపల్లి: వెల్మకన్నలో..


అల్లాదుర్గంలో..


నిజాంపేట(మెదక్): చల్మెడ గ్రామంలో..


హవేళీఘనపూర్: సర్దనలో..


పాపన్నపేటలో..


చేగుంటలో..


మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

సంక్షిప్త వార్తలు

◆ **దేవేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు**



రామాయంపేట(మెదక్): బీఆర్ఎస్ నాయకుడు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం రామాయంపేట పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితెందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో..

మెదక్ మున్సిపాలిటీ: ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం హైదరాబాదులో ఆయన ఇంటి వద్ద, మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. మెదక్, రామాయంపేట మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి దంపతుల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

◆ **చర్చిలో మహిళల ప్రార్థనలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం మహిళ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రాణి జైపాల్ బైబిల్ సందేశం అందించారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ఆడా, మగ తేడా లేకుండా పిల్లలను పెంచాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

◆ **బీసీ సభకు తరలిన నేతలు**

శివ్వంపేట(నర్సాపూర్): హైదరాబాదు సరూర్ నగర్‌లో ఆదివారం నిర్వహించిన బీసీ సభకు మండలం నుంచి బీసీ నేతలు ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బండారి గంగాధర్ ఆధ్వర్యంలో పలువురు సభకు వెళ్లారు. బీసీల ఐక్యత చాటేందుకు ఇలాంటి సభలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.

◆ **నూతనకార్యవర్గం**



పెద్ద శంకరంపేట (మెదక్): నీలకంఠ సమాజం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పెద్ద శంకరంపేట మండల అధ్యక్షుడిగా నీలకంఠ విట్టల్, ఉపాధ్యక్షులుగా కర్ణం రామచందర్, నీలకంఠ రమేష్, కార్యదర్శిగా అభిలాష్, భాస్కర్, కోశాధికారిగా మారుతి, జగన్, శ్రీశైలం, సుభాష్, ప్రశాంత్, మాణిక్యం, పోశెట్టి, దయానంద్, సలహాదారులుగా బగయ్య తదితరులు ఎన్నికయ్యారు.

◆ **బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు**

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ కోసం మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ దరఖాస్తు చేశారు. ఆదివారం ఆయన పార్టీ నాయకులతో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఆయనతో నాయకులు రమేష్‌గౌడ్, రాజేందర్, బుచ్చేష్‌యాదవ్, యాదగిరి తదితరులు ఉన్నారు. నర్సాపూర్‌కు చెందిన ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ గౌడ్ కూడా టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

◆ **సిరిసిల్ల అభ్యర్థిత్వానికి దరఖాస్తు**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని ఉసిరికపల్లికి చెందిన బీజేపీ యువ నాయకుడు అశోక్ సాదుల సిరిసిల్ల నియోజకవర్గ బీజేపీ డగా టికెట్ కేటాయించాలని ఆదివారం పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ సాదుల మాట్లాడుతూ నిరుద్యోగులకు భృతి ఇవ్వకుండా బీఆర్ఎస్ మోసం చేసిందని, అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తానని తెలిపారు.

◆ **ముసురు వర్షం**

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఆదివారం ఎడతెరిపి లేకుండా ముసురుతో కూడిన వర్షం కురిసింది. రోడ్లపై నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరు చేరింది.



కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో రాజనర్సింహ

రేగోడ్(మెదక్): మండలంలోని ప్యారారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు పలువురు ఆదివారం కాంగ్రెస్‌లో చేరినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్ రావు తెలిపారు. 18 మంది బీఆర్ఎస్ కార్యకర్తలకు సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ కండువా కప్పి ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, గ్రామ అధ్యక్షుడు సంగారెడ్డి, యూత్ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు సరికాదు

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్‌కు మెడికల్ కళాశాల కావాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం సరికాదని చిన్నశంకరంపేట మండల వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. జిల్లా అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శివకుమార్, ప్రసాద్‌గౌడ్, ఎస్టీ సెల్ నాయకులు అశోక్, శ్రీనివాస్ ఉన్నారు.

అందరికి బీసీబంధు ఇవ్వాలి

దుబ్బాక: అర్హులైన ప్రతి కుటుంబానికి బీసీబంధు సాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.భాస్కర్ అన్నారు. ఆదివారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి బీసీ బంధు పథకాన్ని కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని, అలా కాకుండా పారదర్శకంగా ఎంపిక చేసి అర్హులైన వారికి పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కర్, రాజు, సాజిద్, మహేశ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్రంగి సంఘం నూతన భవనం ప్రారంభం

దుబ్బాక: పట్టణంలో నూతనంగా నిర్మించిన వడ్రంగి సంఘం భవనాన్ని ఆదివారం ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్ రావు వేర్వేరుగా ప్రారంభించారు. వారిని సంఘం సభ్యులు శాలువ కప్పి సన్మానించారు. రూ. 20 లక్షల ఎస్‌డీఎఫ్, సీడీపీ నిధులతో సంఘం భవనం నిర్మించారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

